క్లుప్తంగా

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. శనివారం నాటికి 61 వేల 680 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం అభివృద్ధికి భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన బొందుగుల బాలయ్య–మణెమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.51 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విరాళ దాత కుటుంబీకులకు ఆలయ పూజారి రాజేశ్వరశర్మ తీర్థ ప్రసాదాలను అందజేసి వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో మృతి చెందిన నిరుపేద అంత్యక్రియలకు ఎంపీటీసీ సభ్యుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన నిరుపేద గోసు శంకర్ అకస్మాత్తుగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చంద్రకాంత్ రెడ్డి, మృతుని ఇంటి వద్దకు వెళ్లి వారి కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం తక్షణ సహాయం కింద రూ.5 వేలను అందజేశారు. ఆయన వెంట నేతలు చేపూరి రాజు, పైతరి పెంటయ్య, రమేష్, అశోక్, సురేష, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథేశ్వరస్వామికి అన్నపూజ

కామారెడ్డి అర్బన్: ఈనెల 11న కార్తీక మాసం నాల్గవ సోమవారం, మాస శివరాత్రి సందర్భంగా స్థానిక విశ్వనాథేశ్వర స్వామి ఆలయంలో అన్నపూజ విశేష పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్టు అర్చకుడు శివకుమార్ తెలిపారు. భక్తులు బియ్యం, పెరుగు సమర్పించి పూజలో భాగస్వామ్యం కావాలని కోరారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారంలోని కొచ్చరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అదమరిస్తే అంతే సంగతులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమం సమీపంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టును నాసిరకంగా నిర్మించడంతో శిథిలావస్థకు చేరి సిమెంటు, కంకర పోయి ఇనుపరాడ్లు విరిగిపోయి గుంతగా ఏర్పడింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేసేవారు ఆదమరిస్తే అంతే సంగతి. ఆ గుంతలో పడినట్లయితే పైకి పోవాల్సిందేనని పలువురు చెబుతున్నారు. దగ్గరకు వచ్చేంత వరకు గుంత ఏర్పడకుండా తయారైంది. ఈ గుంత రోడ్డు మూలమలుపున ఉండడంతో అధికంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడలు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల (ఉప్పల్‌వాయి)లో రాష్ట్రస్థాయి క్రీడలు రెండో రోజు కొనసాగుతున్నాయి. అండర్–17, అండర్–19 విభాగాల్లో వంద మీటర్ల పరుగు పందెం, హ్యాండ్ బాల్, ఖోఖో పోటీలను నిర్వహించినట్లు ప్రిన్స్‌పాల్ సత్యనారాయణ తెలిపారు. ఈ క్రీడా పోటీలను పర్యవేక్షించడానికి నిజామాబాద్ రీజనల్ కో–ఆర్డినేటర్ అలివేలు వచ్చారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- కంపు కొడుతున్న మురికి కాలువలు
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



లింగంపేటలో దుర్వాసన వెదజల్లుతున్న మురికి కాలువ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మురికి కూపాలు కంపు కొడుతున్నాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా పాలకులు, అధికారులు ప్రజలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉదయం లేవగానే ముందుగా మురికి కూపాలే దర్శనమిస్తున్నాయి. దుర్వాసనతో ఇళ్లనుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులు దుర్వాసన తట్టుకోలేక రోగాల బారిన పడుతున్నారు. మండల కేంద్రంలో నిత్యం సంచరించే ప్రదేశాలు మురికి కూపాలుగా మారాయి. చేపల మార్కెట్, కూరగాయల మార్కెట్, రెండో వార్డులో చీరపేండ్ల కుంటకు వెళ్లే నీటి కాల్వ, కల్లు దుకాణాల పరిసరాలు నీటి నిల్వతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈ ప్రాంతాలు ప్రతీ రోజు రద్దీగా ఉంటాయి. ఈ ప్రదేశాల్లో మురికి కాల్వలు సక్రమంగా లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులకు పలుమార్లు మొర పెట్టుకున్నా స్పందించడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మేజర్ జీపీలో సమస్యలు తిష్టవేయడంతో ప్రజలు పాలకులు, అధికారులపై మండిపడుతున్నారు. డెంగీ, మలేరియా లాంటి విషజ్వరాలు సోకి ప్రజలు బాధపడుతున్నారు. మురికి కాల్వలు నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు రోడ్లపైకి వచ్చి చేరుతున్నాయి. చీరపేండ్ల కుంటకు వచ్చే మత్తడి కాల్వ పూడిపోవడంతో మురికి నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి చుట్టు పక్కల ఉన్న ఇళ్లకు దుర్వాసన వెదజల్లుతున్నాయి. పోస్టాఫీసు నుంచి పెద్దమ్మ గుడి వరకు పానాది రోడ్డుకు మురికి కాల్వలు నిర్మించకపోవడంతో ప్రతి రోజు రోడ్డుపైకి మురికి నీరు వచ్చి చేరుతుంది. దాంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారులు, పాలకులు స్పందించి గ్రామంలో మురికి కాల్వలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చేపల మార్కెట్ వద్ద రోడ్డుపైకి వస్తున్న మురికి



డైలీ మార్కెట్ ఎదుట కాలువ



డ్రైనేజీ లేక రోడ్డుపైకి వస్తున్న మురికి నీరు

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుతో పేదలకు లబ్ధి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కౌన్సిలర్ రోహిత్

బాన్సువాడ: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచడం వల్ల పేదలకు నేరుగా లబ్ధి చేకూరుతుందని బాన్సువాడ ఆర్డీవో భుజంగ్‌రావు అన్నారు. ఆదివారం ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ సుధ, కౌన్సిలర్ కాసుల రోహిత్‌లతో కలిసి రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు కార్యక్రమాన్ని స్థానికంగా ప్రారంభించారు. నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ శేఖర్‌రెడ్డి ప్రారంభించిన పథకానికి తిరిగి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పునర్జీవం పోసిందని కాసుల రోహిత్ అన్నారు. అనంతరం బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. నాయకులు ఖాలేక్, అలీబిన్ అబ్దుల్లా, మాసాని శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, కొత్తకొండ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో ప్రారంభిస్తున్న ఆర్డీవో ప్రభాకర్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

ఉచిత బస్సు పథకం ప్రారంభం

ఎల్లారెడ్డి: మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.10 లక్షల ఆరోగ్య బీమా, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఆర్డీవో ప్రభాకర్ ఆదివారం ప్రారంభించారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయం ఆవరణలో జెండా ఊపి ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షల ఆరోగ్య బీమా పథకం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, లింగంపేట జెడ్పీటీసీ శ్రీలత, డిప్యూటీ డీఎంహెచ్వో శోభారాణి తదితరులున్నారు

ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి
- ఆర్టీసీ బస్సులో ప్రయాణం



మహిళలకు జీరో టికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదివారం కామారెడ్డి నుంచి దోమకొండ మండలం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణం జీరో టికెట్‌ను మహిళా ప్రయాణికులకు అందజేశారు. ఆయన టికెట్‌కు డబ్బులు చెల్లించి ప్రయాణం చేశారు. వయస్సుతో నిమిత్తం లేకుండా మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ డీఎం ఇందిర తదితరులున్నారు.

రెండు గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామసభలు



బాన్సువాడ రూరల్: బోర్లం, కోనాపూర్ గ్రామాల్లో ఆదివారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. 2022 –23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులను రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. గుర్తించిన లోటుపాట్లు, సమస్యలను గ్రామసభలో చదివి వినిపించారు. బోర్లంలో రూ.26లక్షలు, కోనాపూర్‌లో రూ.36 లక్షల పనులకు ఆడిట్ చేశారు. సర్పంచ్‌లు సరళ, వెంకట రమణారావు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో పూజలు





పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతి మహా క్షేత్రంలో ఆదివారం కార్తీకమాస చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని కామారెడ్డి పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్య సంఘం కుటుంబ సభ్యులతో అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు చేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు దత్తాత్రిశర్మ, మోహన్‌శర్మ, రమేష్‌శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలాల సిద్దాగౌడ్, రొండ్ల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు బ్లడ్ గ్రూపు తెలుసుకోవాలి



మాచారెడ్డి: ప్రతి ఒక్కరు తమ తమ బ్లడ్ గ్రూపు తెలుసుకోవాలని కామారెడ్డి రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోలబోయిన సత్యం అన్నారు. ఆదివారం పాల్వంచ మండలం ఆరేపల్లి స్టేజీ వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్లడ్ గ్రూపు తెలిసి ఉంటే ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో అవసరమైనప్పుడు ఉపయోగపడుతుందన్నారు. కేజీబీవీ ప్రత్యేక అధికారిణి మైశకల, రోటేరియన్ రాజనర్సింహారెడ్డి, నాగభూషణం, ధనుంజయ, రమణ ఉన్నారు.

చురుకుగా అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప ఆలయం నిర్మాణం తుది దశకు చేరుకుందని గురుస్వాములు రాజు, చిట్టెపు వీరారెడ్డిలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ లేని విధంగా 44వ జాతీయ రహదారికి పక్కన భారీ ఎత్తున ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు వస్తు, ధన రూపేనా సమర్పించి భగవంతుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

టీటీడీ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణ పోటీలు



కామారెడ్డి టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో విద్యార్థులకు ఆదివారం భగవద్గీత పారాయణ పోటీలు నిర్వహించారు. విజేతలకు టీటీడీ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం ఆర్గనైజర్ వీఎస్ఎన్ మూర్తి భగవద్గీతలను అందజేశారు. పాఠశాల ప్రధానాచార్యులు నాగభూషణం, చౌకీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

భూదాత ఇనానిసేట్‌కు ఘన నివాళి



మద్నూర్(జుక్కల్): ప్రభుత్వ ఆస్పత్రి, జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాల ఇలా మద్నూర్‌లోని పలు భవనాలకు భూదాతగా వ్యవహరించిన రాంప్రసాద్ ఇనానిసేట్ జయంతి కార్యక్రమంలో మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో గ్రామస్తులందరూ కలిసి నివాళులర్పించారు. పాత బస్టాండ్‌లోని రాంప్రసాద్ ఇనాని విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. గ్రామ సర్పంచ్ దరాస్‌వార్ సురేష్ మాట్లాడుతూ.. మద్నూర్ గ్రామాభివృద్ధి కోసం ఇనానిసేట్ ఎంతో పరితపించేవారని, ఆయన సేవలు చూస్తేనే అర్థమవుతుందన్నారు. ఇనాని సేట్‌కి జై అంటూ గ్రామస్తులు నినాదాలు చేశారు.

గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటా

ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు



పిట్లంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

పిట్లం/నిజాంసాగర్(జుక్కల్): తనపై విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సాయిగార్డెన్‌లో ఆదివారం నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్, పిట్లం మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావ్ పాల్గొని మాట్లాడారు. పదిహేనేళ్లుగా మోసపోయి దగాపడ్డ జుక్కల్ కాంగ్రెస్ కార్యకర్తలకు, ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని భరోసా ఇచ్చారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేయకుండా మోసం చేసిన హన్మంత్ సింధేకు, తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన గంగారాంకు బుద్ధి చెప్పిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ విజయం సాధించడంతో పిట్లంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చుతూ సంబరాలు చేసుకుంటూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఫ్రీ టికెట్‌లను పంపిణీ చేసి ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. అదే విధంగా పిట్లం ప్రభుత్వ ఆసుపత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్కను ప్రారంభించి, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

ఎన్నికైన తర్వాత మొదటిసారి నియోజకవర్గానికి వచ్చిన లక్ష్మీకాంతరావుకు నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు ప్రదీప్, మల్లికార్జున్, మనోజ్‌పటేల్ పూలమాలలతో స్వాగతం పలికారు. నాయకులు మురళిగౌడ్, మోహన్‌రెడ్డి, శేక్ నజీర్, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు రక్తదానం చేయండి



మాట్లాడుతున్న రక్తదాతల సమూహం ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ నెల 14న మధ్యాహ్నం 2 గంటలకు కామారెడ్డి కర్షక్ బీఎడ్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రక్తదాతల సమూహం వ్యవస్థాపకుడు, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు, అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్‌లు తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తలసేమియా సొసైటీలో 3,500 మంది చిన్నారులు ఉన్నారని, వీరికి ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తమార్పిడి చేయాల్సి ఉంటుందని వివరించారు. కామారెడ్డి దాతల సమూహం ద్వారా 1,650 యూనిట్ల రక్తం అందించినట్టు బాలు, వేదప్రకాష్‌లు పేర్కొన్నారు. రక్తదాతలు 9492874006 నంబర్‌కు సంప్రదించాలన్నారు. సమూహం ఉపాధ్యక్షుడు జమీల్ హైమద్, డాక్టర్ పుట్ట అనిల్, కిరణ్, సలహాదారులు ఎర్రం చంద్రశేఖర్, రమణలు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మద్నూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింధే

మద్నూర్(జుక్కల్): అధైర్య పడొద్దు.. అన్ని వేళలా అండగా ఉండి ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. మండల కేంద్రంలోని గురు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మద్నూర్, డోంగ్లీ, జుక్కల్ మూడు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాను మూడు సార్లు ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందానని, ఈ సారి కూడా అతి తక్కువ ఓట్లతో ఓటమి పాలయ్యానని అన్నారు. ఎన్నికల్లో ఓటమి చవిచూసినా ఇక్కడే ఉంటూ నాయకుల, కార్యకర్తలకు అండగా నిలుస్తానని భరోసా కల్పించారు. రానున్న ఎంపీ, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు గెలుపొందడానికి నా శాయశక్తులు కృషి చేసి మిమ్మల్ని గెలిపించే బాధ్యత నాదే అని చెప్పారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను అమలు చేసేంతవరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి వారి వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అలాగే జుక్కల్ నియోజకవర్గ ప్రజల సమస్యలపై పోరాడి నిలదీద్దామని పేర్కొన్నారు.

నీలకంఠ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

భిక్కనూరు: పట్టణ నీలకంఠ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సమావేశమైన నీలకంఠ సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూడెల్లి పెద్ద నర్సింలు, ఉపాధ్యక్షుడిగా మాడ రంజిత్, ప్రధాన కార్యదర్శిగా పేష్కరి రవి, కోశాధికారిగా కూడెల్లి జ్ఞానేశ్వర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కూడెల్లి పెద్ద నర్సింలు మాట్లాడుతూ.. సంఘం అభ్యున్నతికి సభ్యుల ఐక్యతకు కృషి చేస్తానన్నారు.

పోసానిపేట నూతన వీడీసీ..

రామారెడ్డి: మండలంలోని పోసానిపేట గ్రామ వీడీసీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షుడిగా శనిగారపు సాయిలు, ఉపాధ్యక్షుడిగా గాండ్ల ప్రవీణ్, కోశాధికారిగా బండి నరసింహులు, సెక్రటరీగా సెల్మిటి రాజును ఎన్నుకున్నారు. నూతన కమిటీ గ్రామాభివృద్ధికి మరింత పని చేయాలని సర్పంచు మహేందర్‌రెడ్డి ఆకాంక్షించారు.



కార్యవర్గాన్ని అభినందిస్తున్న సర్పంచ్ మహేందర్‌రెడ్డి

సమాచారం..

నేడు శివపార్వతుల కల్యాణోత్సవం

కామారెడ్డి అర్బన్: స్థానిక శారదా మాతా ఆదిశంకర ఆలయంలో ఈ నెల 11న సాయంత్రం 6 గంటలకు మాసశివరాత్రి సందర్భంగా శివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. కనులపండువగా నిర్వహించే శివ పార్వతుల కల్యాణానికి భక్తులు హాజరై విజయవంతం చేయాలని కమిటీ కోరింది.

నేడు ఎల్లారెడ్డిలో అందుబాటులో ఎమ్మెల్యే

తాడ్వాయి(ఎల్లారెడ్డి): నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మదన్‌మోహన్ ఎల్లారెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ నెల 11న అందుబాటులో ఉంటారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగంరాజు, సాయిరెడ్డి, శ్యాంరావు, షౌకత్‌అలీలు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి అందుబాటులో ఉంటారని, కలవాలనుకునే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎల్లారెడ్డికి వెళ్లి కలవవచ్చని పేర్కొన్నారు.

12న తాడ్వాయి సర్వసభ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి):మండలపరిషత్ కార్యాలయంలో ఈ నెల 12న తాడ్వాయి మండల సర్వస భ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజీవ్ర్ తెలిపారు. ఉదయం 11లకు ఎంపీపీ కొడి రవి అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందన్నారు.